# శివం-సుందరం

"అమ్మా, ఇవాళ సంగీతం మాస్టరుగారు రాలేదేం ?"

"వేళయిందా ?"

"వేళయిందనే చాపవేసుకుని కూర్చున్నాను. అరగంటనుంచీ ఎదురుచూస్తు న్నాను. ఇంకెంతసేపని ఎదురుచూడను ? పరీక్షలు దగ్గరకొచ్చాయి కదా ?"

రంగమణి మరొక అరగంటసేపు గేటుదగ్గర నిలబడి చూసింది.

చీకటిపడుతున్నది. రంగమణి చేతిగడియారం చూసుకుంది. ఆరుగంటలు కావచ్చింది.

"ఇటు సంగీతం నేర్చుకున్నట్టూలేదు. అటు చదువుకున్నట్టూలేదు. టైమ్ వృథాగా గడిచిపోతున్నది. ఈ పరీక్ష గట్టెక్కితే వచ్చే ఏడాదికి కొత్తకోర్సు. కొత్త పుస్తకాలు. ముందది కావాలి కదా ?" గొణుక్కుంటూ ఇంట్లోకి నడిచింది. ఇటూ ఆటూ నాలుగుసార్లు తిరిగి, చదువుకోవటానికి మేడమీదికి వెళ్ళింది,

కోపావేశం తగ్గేవరకూ బాల్కనీ మీద నిలబడి పక్షులు గుంపులు గుంపులుగా-బారులు తీర్చినట్టుగా పైపైకి ఎగురుతూ క్రమంగా చుక్కల్లా కనబడుతూ గూళ్ళకు చేరుకుంటుంటే చోద్యంగా చూస్తున్నది.

వాటికి టైమెట్లా తెలుస్తుందో ?

చీకట్లు విడిన తరువాత, పూర్తిగా తెల్లవారకముందు పక్షుల కిలకిలా రావాలు అందరినీ మేలుకొలుపుతూ ఉంటాయి. కోడి అయితే సరేసరి-గడియారాలు ముందూ వెనుకలుగా నడుస్తాయిగాని కోడి కూసిందంటే నాలుగవ జాము అయిందను కోవలసిందే. వాటికి గడియారాలు లేకపోయినా గడియారాలను ఉపయోగించే మానవాళిని మేలుకొలుపుతాయి.

ఇది సర్వసామాన్య విషయంగా కనబడుతుంది. కాని బాగా ఆలోచిస్తే ఇందులో కూడా ఒక విచిత్రం కనబడకపోదు. పక్షిజాలానికి కూడా సమయ పాలన అనేది తెలుసు. వాటిక్కూడా ఏమిటి-వాటికే బాగా తెలుసునేమో ?

ఆడపక్షి గుడ్లు పెట్టబోయే సమయానికి గూడుకట్టాలని మగపక్షికితెలుసు. గుడ్లు పిల్లలుగా రూపుదిద్దుకున్న తరువాత, ఆహారంతెచ్చి సంతానానికి అందించ టంలో మగపక్షికూడా తోడ్పడుతుంది. గూటి బయటికివచ్చి చిన్నచిన్నగంతులు వేసే పిల్లలపక్కన ఉండి కిందపడి అపాయం కలగకుండా నడకబాగా వచ్చే వరకూ కాపాడతాయి.

అది కన్నవారి బాధ్యత. అదికూడా వాటికి తెలుసు.

వాటికీ కోపతాపాలున్నాయి. ఉల్లాసంగా ఉన్నప్పుడు ముక్కులు రాసు కుంటూ కిచకిచ మంటూ మాట్లాడుకుంటాయి. కోపంవస్తే ఒకదాని నొకటి ముక్కుతో పొడుచుకుంటాయి. అరుచుకుంటాయి. ఘర్షణపడతాయి. ఏ పక్షి మీదయినా కక్షగట్టితే పక్షులు గుంపులుగా చేరి దానిని ముక్కులతో పొడిచి తరిమి కొడతాయి కాని తమలో కలపనివ్వవు.

పక్షుల భాష జంతువుల భాష తెలుసుకోగలిగితే ప్రకృతిలోని విచిత్రా లెన్నో తెలుస్తాయి మనకు.

చటుక్కున ఆమెకు మళ్ళీ సంగీతం మాస్టరుగారి సంగతి జ్ఞాపకంవచ్చింది. తనకు పరీక్షలు దగ్గరికి వస్తున్నాయని ముందుగావచ్చి తనకు పాఠంచెప్పమని ప్రాధేయపూర్వకంగా అడిగింది. కాని రెండురోజులనుంచీ ఆయన తనపాత అల వాటును మానుకోలేక-ముందుగా సౌందర్యవల్లి ఇంటికే వెళ్తున్నాడు. పరీక్షల ముందర ఒకగంట ఆలస్యమైనా విద్యార్థికి ఎంతోకష్టం కలిగిస్తుందన్న సంగతి ఆయన గ్రహించలేదని ఆమె కినుకవహిస్తుంది.

"ఇంక ఇవాల్టికి ఆయన సంగతి వదలిపెట్టి తను చదువుకోవటమే మంచి ద"నుకుని బల్లముందర కూర్చుని పుస్తకం బైటికితీసింది.

ఈ లోపల మీనాక్షమ్మ రెండువీధుల అవతలగా ఉన్న కమలమ్మగారింటికి వెళ్ళింది. బైట ఎవరూ కనబడకపోతే లోపలివరకూ వెళ్ళి "కమలమ్మగారూ.

సంగీతం మాస్టరుగారు నిన్నా ఇవాళ మాయింటికి రాలేదు. మీ యింటికి వస్తు న్నారా ? అడుగుదామనివచ్చాను" అన్నది.

ఆమె నిర్వికారంగా ముఖంపెట్టి "ఆయన నా కంటికి కనబడి వారానికి పైగా అయింది." జవాబుచెప్పి జారిన తలవెంట్రుకల ముడిని సరిచేసుకుంది.

"మీరిలా ఉన్నారేం ? ఆరోగ్యం బాగాలేదా ఏమిటి?" అడిగింది ఆమె ముఖంలోకి చూస్తూ మీనాక్షమ్మ.

"ఏంలేదు. బద్ధకంగా ఉంటే కూర్చున్నాను. ఇంక లేచి వంటచెయ్యాలి."

"మీరు బద్ధకమంటున్నారు గాని-వారంరోజులు భోజనంలేనట్టు కనబడు తున్నారు. వచ్చేది వేసవికాలం.... ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. కొబ్బరి నీళ్ళు తాగండి. ప్రాణంహాయిగా ఉంటుంది."

ఆమె ఇంటికి వచ్చేసరికి రామచంద్రంగారు అప్పుడే లోపలికి వస్తున్నారు.

"ఇవాళకూడా సంగీతం మాస్టరురాలేదా? నెలకాకముందే చెయ్యిచాపుతాడు డబ్బుకు. అన్నట్టు రంగ ఏది ?"

"దానికి కోపంవచ్చింది"

"ఎందుకు ?"

"తనకు పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని ముందుగా తనకు పాఠం చెప్ప మని అడిగిందట. ఎన్నిసార్లు అడిగినా ఆయన ఆ సౌందర్యవల్లి ఇంటికేముందు వెళ్ళుతున్నాడట. అందుకని అలిగి మేడఎక్కింది. వాళ్ళింట్లో ఉన్నాడేమోనని వెళ్ళి అడిగితే అక్కడికి ఆయనవచ్చి వారంరోజులయిందని కమలమ్మగారు చెప్పారు."

ఊఁ అంటూ ఒక నిట్టూర్పు విడిచి కాళ్ళు కడుక్కోటానికి వెళ్తూ "అడగ టానికి వాళ్ళింటికి వెళ్ళిందెవరు ?" రోషం కోపం పందేలు వేసుకున్నట్టుగా ఆయన కంఠం ధ్వనించింది.

"విసుగుపుట్టి రంగపైకివెళ్ళి కూర్చుంటే నేనే వెళ్ళానని చెప్పానుగా ?"

ఆయన చూపుల్లో మంటలు కనబడ్డాయామెకు.

"ఆయన కూడా మనిషే. ఇంట్లో ఏదయినా ఇబ్బంది వచ్చిందేమో ? లేక ఆయనకే ఒంట్లో బాగాలేదో!? ఊరికే ఇంట్లోకూర్చునే మనిషి కాదాయన" అన్నాడు.

అంతటితో సంభాషణను ముగించి ఆమె తనపనిమీద గదిలోకి వెళ్ళి పోయింది.

రామచంద్రంగారు మరునాడు పట్టాభిగారింటికి వెళ్ళారు. ఇద్దరూ ఒక ఆఫీసులోనే పనిచేస్తారు. రామచంద్రంగారు పట్టాభిగారు చెప్పినమీదనే సంగీతం మాస్టర్ని తన కూతురికి కూడా చెప్పమని అడిగారు.

పట్టాభిగారు అప్పుడే స్నానంచేసి వస్తూ"కూర్చోండి ఇప్పుడేవస్తాను." అని లోపలికివెళ్ళి షర్టు వేసుకునివచ్చారు.

ఆఫీసు విషయాలు రాజకీయాలు, మాట్లాడుకున్నారిద్దరూ. కాని-సంగీతం మాస్టరుగారి ప్రశంసరాలేదు. మధ్యమధ్య ఏమిటో ఆలోచిస్తున్నట్టుగా కనబడ్డారు పట్టాభిగారు.

"ఏమిటలా ఉన్నారు? ఆరోగ్యం బాగుందికదా?"

"ఆఁ ఏదో-తలదిమ్ముగా ఉంటే చన్నీళ్ళ స్నానంచేస్తూ తలమీద కూడా పోసుకున్నాను. ఏదన్నా చేస్తుందేమోనన్న భయం. ఆ మధ్య జబ్బుపడ్డాను. అప్పటినుంచీ భయం. అంతే." మరో అరగంటసేపు ఊరి కబుర్లతో కాలక్షేపం చేసి ఇద్దరూ లేచారు.

సంగీతం మాస్టరు దాదాపు నలభైఏళ్ళ మనిషిలా కనబడతాడు. ఆకర్షణీయమైన విగ్రహం. పిల్లలను నవ్విస్తూ చమత్కారంగా మాట్లాడిస్తూ పాఠం చెప్తాడు ఆయన ఆ ప్రాంతంలో పదిమంది పిల్లలకు పాఠం చెప్తాడు. ఆయన శిష్యురాండ్రు ముగ్గురు ఒక కాలేజీలో చదువుతున్నారు. ఐదుగురమ్మాయిలకు కాలేజీ చదువులేదు కనుక శ్రద్ధతో పాఠాలు బాగా ప్రాక్టీసుచేస్తారు. సౌందర్యవల్లి రంగమణి వేరువేరు కాలేజీలలో చదివే అమ్మాయిలు.

సౌందర్యవల్లి కో ఎడ్యుకేషన్ కాలేజిలో చదివే విద్యార్థిని. ఆమెకు తన క్లాస్‌మేట్ ప్రియంవదతో స్నేహం. ఇద్దరూ కలిసిమెలిసి తిరుగుతూఉంటారు. ఈ ఇద్దరమ్మాయిలతోటి చనువులా ఉండే సహాధ్యాయులు సత్యం, శివం. పుస్త

కాలూ నోట్సూ మార్చుకుంటూ ఉంటారు. కాలేజీకని వచ్చి ఉదయపుఆట సినెమాలు చూస్తూ ఉంటారు. దీనిలో సత్యం ప్రోద్బలం ఎక్కువ.

ప్రియంవద చేతిలోను సత్యం చేతిలోను డబ్బు మెదులుతూఉంటుంది. పరీక్షలకు చదుకొమ్మని సెలవులిస్తే కులాసాగా కాలక్షేపంచేయాలని ఆలోచిస్తారు.

"ఈసారి ఎక్కడికివెళ్దాంచెప్పు?" సత్యం ప్రియంవదను అడిగాడు.

సౌందర్యవల్లితో శివం ఆలోచిస్తున్నాడు.

"అసలు ఈప్లానే నాకు నచ్చలేదు. చదువుకోకుండా ఈ సరదా ప్రయాణాలంటే నాకిష్టంలేదు. ఈ సత్యం నన్ను నిలవనీయటంలేదు. ఇది మళ్ళీ మేకప్ చేసుకోలేం. ఎక్కువదూరం వాళ్ళు ప్లాన్ చేసినా ఒప్పుకోకు. డబ్బెక్కువ ఖర్చవుతుంది. అదీకాక మనం తొందరగా తిరిగిరావాలి. జ్ఞాపకంపెట్టుకో" ముందుగానే శివం హెచ్చరించాడు సౌందర్యవల్లిని.

"బయలుదేరినవాళ్ళం హాయిగా ఎంజాయ్‌చేసివద్దాం. ఎప్పుడూ చూడనివి చూద్దాం. పెద్దవాళ్లూ వాళ్ళకట్టుబాట్లూ ఉండనేఉన్నాయి. పరీక్షలూ ఎప్పుడూ ఉండేవే. ఇంక డబ్బంటారా-ఎలాగో మనలోమనమే సర్దుకోవాలి. ఇంతవరకూ మనం వినడమేకాని అజంతా ఎల్లోరాగుహలూ వాటిలోఉండే విశేషాలూచూశామా? అవిచూడతగినవి. చదివితేచాలదు కంటితోచూడాలి. ఈసారి వాటినిచూద్దాంపదండి. శివం నీదగ్గర ఎంతడబ్బుఉంటే అంతే తీసుకురా." అంటూ డబ్బులేదని శివం ఎక్కడ వెనకడుగువేస్తాడోనని సత్యం ప్రోద్బలం చేస్తున్నాడు. పైకి గంభీరంగా ఉన్నా-డబ్బెక్కడినుంచి తేవాలని ఆలోచిస్తోంది సౌందర్యవల్లి.

ప్రయాణం నిశ్చయమైంది. అజంతా ఎల్లోరాగుహలు చూడటానికే ఓట్లు పడ్డాయి. సౌందర్యవల్లికీ శివానికీ తక్కువపడ్డడబ్బు సర్దుబాటుచేసే బాధ్యత మిగతా ఇద్దరూ తీసుకున్నారు. ఒక రోజు ఉదయం కాకముందే చేతిసంచులతో నలుగురూ బయలుదేరారు. అజంతా ఎల్లోరాగుహలూ శిల్పాలూ తైలవర్ణచిత్రాలూ చూస్తూ ఒక హోటల్లోదిగి ఎన్‌జాయ్ చేస్తున్నారు.

ఈ నలుగురి ఇళ్ళల్లోనూ తల్లిదండ్రులు క్షోభించి పోతున్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులు పైకిచెప్పుకోలేక-పోలీసురిపోర్టు ఇవ్వలేక-మథన పడుతున్నారు.

సౌందర్యవల్లి ఇంట్లో మౌన సంక్షోభం. తల్లి కమలమ్మ తన చంద్రహారం కోసం బీరువాలన్నీ వెతికింది. ఏమయిపోయిందన్న ఆందోళన-చికాకులతో క్రుంగిపోతున్నది.

పట్టాభిగారుకూడా కడుపులోమసులుతున్న భయాందోళనలను పైకికనబడనీయకుండా కాలేజికివెళ్ళి విద్యార్థులదగ్గరనుంచి ఆరాలుతీయటం మొదలుపెట్టారు. మగపిల్లలు ఎవరూ బయటపడలేదు. కాని-ఆడపిల్లలలో ఒకపిల్ల-"సౌందర్యవల్లీ ప్రియంవదా కాలేజీకి రావటంలేదనీ ఏఊరో వెళ్ళాలని మాట్లాడుకుంటుంటే తాను విన్నాన"నీ చెప్పింది.

సౌందర్యవల్లీ ప్రియంవదా కనబడకపోవటమూ సంగీతంమాస్టరు చెప్పకుండా రాకపోవటమూ గమనించిన పట్టాభిగారికి అనుమానంకలిగింది. ఈ రెండు సంఘటనలనూకలిపి ఆలోచించటం మొదలుపెట్టారు భార్యాభర్తలు. ఆలోచనలలోనుంచి అనుమానం బయలుదేరి ధృవపడ్డది.

కమలమ్మకు చెప్పకుండా పట్టాభిగారు పోలీసు కంప్లైంటుఇచ్చారు. ఆడపిల్లల ఫోటోలతో సంగీతం మాస్టరుగారిపేరూ ఊరుతోసహా వివరాలుజోడించారు.

పోలీసు డిపార్టుమెంటు వెంటనే సంగీతంమాస్టరుగారి ఊరికి అరెస్టు వారంటుతోవెళ్ళి "అమ్మాయిలు ఎక్కడున్నారుచెప్పు?" అంటూ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు.

సంగీతంమాస్టరుకిది ఎదురుచూడని సంఘటన.

"ఆ పిల్లలకు నేను సంగీతపాఠాలు చెబుతున్నమాటనిజమే. కాని-వాళ్ళెక్కడికి వెళ్ళిందీ నాకు తెలియదు. మా అబ్బాయికి జ్వరంవస్తున్నదని ఉత్తరంవస్తే నేను బయలుదేరివచ్చాను. అయితే వాళ్ళయింటికివెళ్ళి చెప్పటానికి టైము లేకపోయింది." అని ఆయన ఎంత ప్రాధేయపడినా పోలీసువారు ఆగలేదు. ఆ ఊరినుంచి తీసుకువచ్చి పోలీసు కస్టడీలో పెట్టారు.

అజంతా ఎల్లోరాగుహలు చూడటానికివెళ్ళిన బృందం అనుకున్నట్టుగా నాలుగురోజులకు రాలేకపోయింది. సౌందర్యవల్లికి వికారం వాంతులూ ఎక్కువై

నీరసించిపోయి ప్రయాణం చేయటానికి వీలుకాకపోయింది. ఒక వారంరోజులు అందువల్ల ఆలస్యంఅయింది.

అందరూ తిరిగి ఎవరిళ్ళకువాళ్ళు చేరుకున్నారు. సౌందర్యవల్లి వాడిపోయిన ముఖంతో-శుష్కించినదేహంతో రేగినతలవెంట్రుకలతో ఇంట్లో అడుగుపెట్టేసరికి కమలమ్మ ఎదురుగావచ్చి "ఏమిటీఅవతారం? ఎక్కడికివెళ్ళావు? ఎవరితోవెళ్ళావు? ఏమిటీనాటకం?" అంటూ చెయ్యిపట్టుకుని గదిలోకిలాక్కెళ్ళి కొట్టినంతపనిచేసింది. ఆమె కళ్ళల్లో-చంద్రహారం కనబడకపోయినా తళతళలాడుతూ మెదులుతున్నది.

"నీ వెక్కడినుంచివచ్చావు? ముందుతనువెళ్ళి నిన్ను తరువాత రమ్మన్నాడా సంగీతంమాస్టరు?" అంటూ కళ్ళుపెద్దవిచేసుకుని గట్టిగాఅరుస్తూ - పెరట్లోనుంచి వచ్చాడు పట్టాభిగారు.

అసలే నీరసంగాఉన్న సౌందర్యవల్లి వాళ్ళిద్దరిఅరుపులకూ ఒణుకుతూ కింద పడిపోయింది.

"మనముందర వేషాలువేస్తున్నది. ఎవరయినావింటే ఎంత అప్రతిష్ఠ?" వాళ్ళిద్దరూ బుగ్గలు నొక్కుకున్నారు.

ప్రియంవదకుకూడా ఇంట్లో ఇటువంటి సత్కారమే జరిగింది. కాని ప్రియంవద సందర్భాన్నిబట్టి మాటమార్చగల యుక్తిశాలిని. నమ్మేటట్టుగా మంచి కథ అల్లింది.

"ఇద్దరు లెక్చెరర్లనుఇచ్చి పదిమంది విద్యార్థులను అజంతా ఎల్లోరాగుహలు చూడటానికి మా ప్రిన్సిపల్ గారు పంపించారు. ఇంటికివచ్చి చెప్పటానికి మాకు టైమ్‌లేకపోయింది. పరీక్షలముందర చదువుకోకుండా మాఅంతటమమ్మల్ని వెళ్ళనిస్తారా కాలేజివాళు? అదీగాక - మాకుమాత్రం చదువుకోకుండా పరీక్షల ముందర వెళ్ళాలనిపిస్తుందా? చిన్నపిల్లలమా ఏమిటి! వెళ్ళి నాలుగు రోజులలో రమ్మంటే మా సౌందర్యవల్లి జబ్బుపడ్డది. మాకు అయ్యేఖర్చులు మా ప్రిన్సిపల్ ఎడ్వాన్సుచేశారు. ఆయన వెళ్ళమన్న తరువాత వెళ్ళకతప్పదు. ఏంచేస్తాం వెళ్ళక? ఆయనమాట వినటం మాతప్పా? చెప్పండి?" అంటూ తల్లిదండ్రులకంటె నోరు పెద్దదిచేసింది ప్రియంవద.

పట్టాభిగారు కూతురు మరోలాచెప్పిన కథనాన్ని నమ్మకపోయినా, కూతురు

ఇంటికివచ్చిందని ఆడపిల్లను రచ్చకెక్కించట మెందుకనుకున్నారు. కేసు విత్‌డ్రా చేసుకుంటున్నాను కనుక సంగీతంమాస్టర్ని విడిచిపెట్టమని పోలీసు ఇన్‌స్పెక్టర్ని బ్రతిమిలాడుకున్నారు. ఆయన పిల్లలతండ్రి అయిన మాస్టరు గారిని పోలీసు కస్టడీలోకి తీసుకోవటంచూసి చాలా బాధకలిగింది.

"కంప్లైంటుఇచ్చిన తరువాత కేసు కోర్టులోతేలవలసిందే"నని ఇన్‌స్పెక్టరు పట్టాభిగారిమాటలు వినలేదు. అక్కడ విద్యార్థుల ప్రసక్తేరాలేదు. ఒక సంగీతం మాస్టరుగారినే దోషిగా నిలబెట్టారు.

సంగీతంమాస్టరు "నే నేంచేశానని నన్ను దోషిగానిలబెట్టారని కోర్టుకు హాజరయినసౌందర్యవల్లినీ ప్రియంవదనూ అడుగుతున్నట్లుగా" చూశారు. ఆయనను చూడగానే వాళ్ళిద్దరికీ ముఖాలు పాలిపోయి దేహాలు ఒణకటం మొదలుపెట్టాయి.

"వీరితోమేము వెళ్ళలేదు. మా మాస్టరుగారు నిరపరాధి" అని ఇద్దరూ ఘంటా పథంగా చెప్పి కన్నీళ్ళు కార్చారు.

"నేను పొరబాటుపడ్డాను. కాలేజిప్రిన్సిపల్‌గారే పంపించారట కొంతమంది పిల్లలను లెక్చెరర్లనుతోడిచ్చి. ఇది నా తొందరపాటుతప్పు వాళ్ళతప్పుకాదని" పట్టాభిగారు సాక్ష్యంచెప్పారు.

ప్రియంవద ఏమీఎరగనట్టు తల్లిదండ్రులకు నచ్చచెప్పి ఎప్పటిమాదిరిగా ధైర్యంగా కాలేజికి వెళ్ళుతున్నది.

సౌదర్యవల్లిమాత్రం పక్కమీదినుంచి లేవలేకపోతున్నది. భోజనంలేదు నిమ్మరసంతో ప్రాణం నిలుపుకుంటున్నది.

సిగ్గుతో నలుగురిలోతిరగలేని పట్టాభిదంపతులు తలుపులువేసుకుని ఇంట్లోనేఉంటున్నారు. ఆయన ఆఫీసుకు సెలవుపెట్టారు.

సౌందర్యవల్లి తల్లిదండ్రులబాధ చూడలేకుండాఉంది. ఒంట్లో ఓపికలేదు. అయినా ధైర్యంతెచ్చుకుని ఓపికచేసుకుని, రాత్రివేళ అందరూ పడుకున్న తరువాత ఒక సూట్‌కేసులో తన బట్టలు సర్దుకున్నది. చంద్రహారం అమ్మగా మిగిలినడబ్బు లెక్కబెట్టితే పన్నెండువందలు చేతిలోమిగిలాయి. వచ్చిన అపవాదు రానేవచ్చింది. ఈ మిగిలినడబ్బు ఇంట్లోపెట్టినా ఆ అపవాదుపోదు. ఆ డబ్బును

పర్సులో భద్రపరచుకున్నది. నాలుగుగంటలు ఎప్పుడవుతుందా అని ఎదురు చూస్తున్నది.

తెల్లవారుఝామున నాలుగు గంటలకు మంచినీళ్ళపంపు ఒదులుతారు. ఆ చప్పుడు కాగానే ఊరంతాలేస్తారు. నాలుగుగంటలయ్యే ముందర పెరటి తలుపులు తెరుచుకుని తిన్నగా స్టేషన్‌కి బయలుదేరింది. కాని నడవలేక దారిలో ఒక రిక్షా ఎక్కి స్టేషన్‌కి చేరుకుంది.

ఎక్కడయినా గవర్నమెంటు హాస్పిటల్ ఉన్న చోటికి వెళ్ళాలి. కాని అక్కడ తెలిసినవాళ్లెవరూ ఉండకుండా ఉండాలి. అక్కడికి చేరుకుంటే తనే విధంగానైనా బ్రతుకు తెరువును గురించి సర్దుబాటు చేసుకోగలదు.

కొంత సేపాలోచించి తనకు కొత్తఊరు విశాఖపట్నం. అక్కడికి ఒక టికెట్ తీసుకుంది.

స్టేషన్‌లో వేడి వేడి కాఫీ బ్రెడ్ తీసుకుంది. ప్రాణం లేచివచ్చినట్లని పించింది.

"అయితే ఇన్నిరోజులూ తనకు ఆహారం సరిగాలేకనేనా అంత నీరసం? కడుపులో ఉన్నబిడ్డ ఏంచేసిందని అట్లా ఉపవాసాలుచేసి మంచినీళ్ళుతాగి కాలం గడిపింది?"

తనూ శివం నాలుగేళ్ళనుంచీ స్నేహితులు. చదువులైన తరువాత ఉద్యోగాలు వెతుక్కొని పెళ్ళిచేసుకుందామనుకున్నారు.

అనుకున్నట్టుగా శ్రద్ధగా బాగా చదివితే క్లాసు వచ్చేది కాని ఇద్దరికీ చదువు మీద శ్రద్ధ తగ్గింది. వయసు తొందరలకాగలేకపోయారు.

శివం సౌందర్యవల్లిని మనసారా ప్రేమించాడు. ఆమెను అర్ధాంగిగా చేసు కోవాలన్న భావంతోనే సన్నిహితుడైనాడు. అతడు పరుగులు పెట్టాలనుకున్నాడు. కాని-కాలం సహకరించలేదు. మార్కులు చాలలేదు. మెడికల్ కాలేజీ సీటును అందుకోలేక పోయాడు.

తండ్రికాబోతున్నాడని తెలుసుకున్న శివం వయసు తొందరలలోనుంచి బయటపడగలిగాడు. ఎవరికీ తెలియకుండా రిజిస్ట్రార్ ఆఫీసుకువెళ్ళి రిజిస్టర్డ్ మేరేజి

చేసుకున్నారు. పూలహారాలతో, సాక్షుల సమక్షంలో ఫొటోలు తీసుకున్నారు. మేరేజి సర్టిఫికెట్లతో ఫోటో కాపీలు కూడా ఇద్దరూ చెరొక సెట్ తమ దగ్గర భద్రపరచుకున్నారు.

అసలు అజంతాఎల్లోరా ప్రయాణం శివం ఇష్టపడి చేసిందికాదు. అంతా సత్యం చేసిందే. తను ఏబలహీనపు క్షణంలోనో అతడి వలలో పడ్డాడు. సత్యం ప్రియంవదల మధ్య గలది ప్రేమించే స్నేహం కాదు. ఆమె అతడికి ధనసహాయం చేసే సాధనం మాత్రమే, అది మామూలు స్నేహం కావచ్చు-ఆమెను ఉపయోగించుకుని తరువాత కాలతన్నే మనస్తత్వం కావచ్చు. పెదవులమీది తేనెలాంటిది కావచ్చు. కాని-అంత అంతరంగంలోనుంచి ఉవ్వెత్తున లేచిన ప్రణయతరంగం మాత్రంకాదు. పాపం ప్రియంవద ఎప్పుడు తెలుసుకుంటుంది?

శివం బి.యస్సీలో చేరాడు. అతడు రెండవ సంవత్సరంలో ఉండగా సౌందర్యవల్లి కాలేజిలో చేరటంతోనే అయస్కాంతంలా ఆకర్షించింది. శివం దాపరికంలేకుండా తన హృదయాన్ని పరచాడు ఆమె ముందర. అతడు ఏ క్షణంలో ఏమాలోచిస్తున్నదీ కూడా ఆమెకవగతమయేటట్టుగా మెలిగాడు. ఆమెను మలచాడు.

ఆమెను విశాఖపట్నం వెళ్ళమని చెప్పినదీ శివమే. తన గమ్యమూ అదేనని చేతిలోచెయ్యి వేశాడు.

ఆమె విశాఖపట్నం స్టేషన్‌లోదిగి తిన్నగా హాస్పిటల్ సూపర్నెంటు దగ్గరికెళ్ళి, తను బి.యస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిననీ, తనకు హాస్పిటల్ ఆవరణంలో ఉండటానికి తావిచ్చి, ఏపని చెప్పినా చేస్తానవి చేతులు జోడించింది.

ఆయన ఆమె ముఖాన్ని పరీక్షగా చూశాడు. ఈ విద్యార్థిని ఒంటరిదయి వచ్చినట్టుపాలిపోయిన ముఖం-దీనంగా చూసే చూపులు ఆయనను ఆలోచింపచేశాయి.

"అమ్మాయీ, రేపు రాగలవా?" అన్నాడు ఆలోచించటానికి సమయం కావాలికదా అన్నట్టు.

"అంతవరకూ ఎక్కడుండను సర్?" తలవంచుకునే మళ్ళీ చేతులు జోడించింది.

"ఓహో! అదికూడా ఒక సమస్యేకదూ?" అంటూ కూర్చోమని కుర్చీ చూపించి ఫ్యూన్ కొరకు గంట కొట్టాడు.

ఫ్యూన్ రాగానే మదర్‌ని పిలవమన్నాడు. ఆమె నర్సులందరిపైన అధికారిణి. నర్సులేకాదు డాక్టర్లుకూడా ఆమె నెంతో గౌరవిస్తారు. ఆమె ఏంగ్లో ఇండియన్ సంతానం. నర్సుగా ఉన్నప్పుడు-మదరైన తరువాత తన బాధ్యతలను రూల్సు ప్రకారం నిర్వర్తించే ఉద్యోగిని. హాస్పిటల్‌లోని చిన్న పెద్ద ఉద్యోగులు ఎంత గౌరవించినా ఆమె తన పరిధిని దాటదు.

ఆమె రాగానే సూపర్నెంటుకు గౌరవ సూచకంగా తలవంచింది.

"ఈ అమ్మాయినీ, దైన్యమైన ఆమె పరిస్థితులలో మనం ఎటువంటి సహాయం చేయగలం? ఏ పనిచెప్పి ఈ ఆవరణంలో ఉండటానికి స్థావర మేర్పరచగలం? మీ సలహా ఏమిటి? మీ సహాయం ఎంతో అవసరం" అన్నాడు.

మదర్ తన చూపులను సౌందర్యవల్లినిపై తిప్పి ఆమెను నిశితంగా చూసింది.

"బి. యస్సీ పూర్తిచెయ్యవా? చేసుకోవాలనిలేదా?" మొదటిప్రశ్న సూటిగా వేసింది.

"పూర్తిచెయ్యాలని కాలేజిలో చేరాను. పరీక్షల ముందర నా పరిస్థితులు తలక్రిందులయ్యాయి ఇప్పుడు పూర్తిచేసే అవకాశంలేదు. శరీర కష్టంచేసి అయినా బ్రతకాలి" అన్నది.

"నీకు చెప్పిన పని ఏదయినా బాధ్యతతో భయ భక్తులతో చెయ్యాలి. నా వెంటరా"

సూపర్నెంటుకు గౌరవ సూచకంగా తలవంచి, సౌందర్యవల్లిని తనతో కూడా తీసుకు వెళ్ళింది. ఆఫీసురూమ్‌లో కూర్చుని స్వచ్ఛమైన తెలుగుభాషలో "కూర్చో"మని ఒక స్టూలు చూపించింది.

సౌందర్యవల్లి సూట్‌కేసు పక్కకుపెట్టుకుని కూర్చుంది.

"ముందు నీ సంగతంతా చెప్పు? ఏ ఊరు? చదువు వదలిపెట్టి ఇట్లా వచ్చావెందుకు? ఇంటినుంచి పారిపోయి వచ్చావా? పెళ్ళి అయిందా?"

సౌందర్యవల్లికి దేహమంతా వణికింది. చెమటపోసింది. చప్పున సర్దుకొని, సూట్‌కేసు తెరిచి శివంకూ తనకూ పెళ్ళి అయినట్టుగా సర్టిఫికెట్, ఫోటో

చూపించింది. ఆమె తల్లిలా అడిగినందుకు తనకు మూడు నెలలు నిండబోతున్నట్టు చెప్పింది. అతడు ఇక్కడికి వెళ్ళమన్నాడనీ పరీక్షలయిన తరువాత మెడికల్ కాలేజీలో చేర్తాడనీ చెప్పింది.

అంతావిని "నీవు ప్రస్తుతం స్టోర్‌కీపర్‌కి అసిస్టెంటుగా పనిచెయ్యి ఈపోస్టు ప్రత్యేకంగా నీ కోసమే సృష్టించాము. ప్రస్తుతం స్టోర్‌కీపర్ క్వార్టర్సులో ఒకగది నీకిప్పిస్తాను. నీ వంట నీవు తయారుచేసుకో" ఇక్కడ పనిచేస్తూఉంటే నీకంతా తెలుస్తుంది. అలవాటుకూడా అవుతుంది. నీకు ఈ లోపల పురుడు రావచ్చు. బిడ్డతో వేరేపనులు చేయలేవు. బిడ్డ పెరిగిన తరువాత నీవు చేసేపని నీ ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుంది. నీ భవిష్యత్తు కూడా నిర్ణయమవుతుంది, జాగ్రత్తగా మసులుకో."అంటూ ఒక నిస్టర్ని పిలిపించింది ఆమెతో సౌంధర్యవల్లిని పంపించింది.

స్టోర్‌కీపరు చెప్పినట్టుగా ఆమె చేతి క్రింద పనిచేస్తూ, తనకని ఇచ్చిన ఒక చిన్నగదిలో వంటచేసుకుంటూ, కాలం గడుపుతున్నది వల్లి.

ఆమె పనిచేయటం మొదలు పెట్టినప్పటినుంచీ అంత పెద్దపేరుపెట్టి పిలవలేక వల్లీ అని పిలుస్తున్నారు అందరూ.

పడుకోగానే తల్లిదండ్రులు జ్ఞాపకం వస్తారు వల్లికి. తన్ను ఇంటినుంచివెళ్లిన తరువాత తల్లిదండ్రులు కొడుకు దగ్గరికి వెళ్ళి ఉంటున్నారని విన్నది. శివం తనను 'అక్కడే జాగ్రత్తగా ఉండ'మని జాబురాశాడు.

ఆమెకు నెలలునిండి పురుడు వచ్చేవరకూ పనిచేసింది. ప్రసూతి సెలవు ఇచ్చారు. పురుడు హాస్పిటల్లోనే జరిగింది. శివం పోలికగల ఆడపిల్ల పుట్టింది. సెలవు అయిపోయిన తరువాత తొట్టిలో బిడ్డను పడుకోబెట్టుకుని పనిచేసింది. బాధ్యతతో నమ్మకంగా పనిచేస్తుందనే పేరు తెచ్చుకుంది.

పాపకు మదర్ 'రోజీ' అని పేరు పెట్టింది. పాప పాలరాతి బొమ్మలా ఉన్నది. పాపకు కావలసినవన్నీ అందరూ తలా ఒకటి తెచ్చి యిస్తున్నారు. "పాపకు ఇది ఉంటే బాగుంటుంది. అది ఉంటే బాగుంటుందని" వంతులు వేసుకుని తెస్తున్నారు. పాపకు ఒక్కొక్కటే పాకటం-నడవటం-మాట్లాడటం వచ్చాయి. అందరినీ పిలిచి మాట్లాడిస్తోంది. మదర్‌ని గ్రాండ్‌మమ్మీ అని పిలవటం మొదలు పెట్టింది, ఎప్పుడూ గంభీరంగా పనిలో మునిగిపోయే మదర్‌కి కూడా ఆ బిడ్డపట్ల ఆకర్షణ కలిగింది.

పగలంతా పనిచేయటంలో నిమగ్నురాలైన వల్లికి రాత్రి పడుకోగానే తన కాలేజీ జీవితం జ్ఞాపకం వస్తుంది. "శివం ఎక్కడున్నాడు? ఏంచేస్తున్నాడు? ఈ పాటికి చదువు అయిపోయిఉంటుందా? పాపకే ఆరేళ్ళు వస్తే అతడి చదువు పూర్తి కాకుండా ఉందా? ఇంకా పై చదువులు చదువుతున్నాడేమో? లేక విదేశాలకు వెళ్ళాడేమో?" జవాబులు తెలియని ప్రశ్నలు ఉదయించి ఆమెకు మతి పోయేటట్టు చేస్తున్నాయి.

మనిషి మనసు మొదటినుంచీ చివరివరకూ ఒకేమాదిరిగా ఉంటుందని కొందరంటారు. జీవితంలో దశలుమారుతున్న కొద్దీ మనసులూ మారుతూ ఉంటాయని మరికొంద రంటారు. ఎవరు ఏపని ఎప్పుడు ఎలాచేస్తారో ఎందుకుచేస్తారో చెప్పటం కష్టమంటారు ఇంకా కొందరు. ఇవన్నీ నిర్ధారించిచెప్పటం కష్టమేగాని శాస్త్రజ్ఞులు ప్రతిదానికీ ఏదో ఒక పేరుపెడతారు. ఇప్పుడు శివంమనసు మారిపోయిందేమో? పోయేటట్టుఇచ్చిన వాగ్దానం-చేసుకున్న పెళ్ళి-వాటిని మరిచిపోయాడేమో?

కాలం పరుగెత్తుతున్నట్లనిపిస్తోంది తనకు పాపస్కూలుకువెళ్ళటమూ శివంలా బాగా పొడుగవటమూ, "ఏదో క్లాసులోకివచ్చావు. బాగాచదివి మంచిమార్కులు తెచ్చుకోవాలి. నీవు పెద్ద డాక్టరువయిపోయి ఇక్కడే పనిచేయాలి" అంటున్నారు మదర్‌దగ్గర్నుంచి. రోజీని అందరూ కనిపెట్టిచూస్తారు. తల్లిగా తనకు ఏబాధ్య తనూ మిగలనివ్వటంలేదు.

వల్లి ఎవరితోనూ అవసరమయితేతప్ప మాట్లాడదు. ఎంతో అవసరమయితే తప్ప ఎక్కడికీవెళ్ళదు డాక్టర్లెవరోతెలియదు. నర్సులూ సిస్టర్లూ ఎందరో వాళ్ళ పేర్లేమిటో తెలియదు.

సూపర్నెంటుకు నాలుగేళ్ళక్రిందట రిటైర్మెంటువచ్చింది. ఆయనకు ఫేర్‌వెల్‌పార్టీ ఇస్తున్నారు హాస్పిటల్ స్టాఫంతా. ఆ పార్టీలో ఎక్కడచూసినా రోజీయే. తననుకూడా రమ్మనమని మదర్ చెప్పింది.

కాని-తను వెళ్ళలేకపోయింది. ఆయనేకదా తనకు కొత్తజన్మనిచ్చిన ఆత్మీయుడు? ఆయన రిటైరయి వెళ్ళిపోతుంటే తనువెళ్ళి కృతజ్ఞతలు చెప్పాల్సిన బాధ్యతలేదా? ఉంది అంతకంటె పూజ్యభావమే ఆయనపట్ల తనకున్నది. కాని-అందరిలో ఆయనకు తన మనోభావాలను విప్పిచెప్పలేని పరిస్థితి.

పార్టీ అయిన తరువాత ఆయన క్వార్టర్సుకువెళ్ళి పాదాలుపట్టుకుంది. "మీరే నాకిక్కడ పనిఇప్పించి ఒక స్థావరమేర్పరచకపోతే నేనేమయిపోయి ఉండేదాన్ని? బహుశః ఫుట్ పాత్ మీద ఉండేదాన్ని. నన్నొకమనిషిగా నిలబెట్టిన మహానుభావులు. నేను ఏంచేస్తే మీ ఋణం తీరుతుంది?" అని కన్నీరుగార్చింది.

ఆమెను లేవనెత్తి "శ్రద్ధగా పాపనుపెంచు. నేనీ ఊళ్ళోనేఉంటాను. ఇక్కడికివచ్చి చూస్తూఉంటాను. పాప డాక్టరుకావాలి. అదే నా కోరిక" అన్నాడు.

ఆమెకు తరువాత తెలిసింది పాపకు కావలసిన వస్తువులన్నీ ఆయనే పంపిస్తున్నారని.

ఏమిటీ ఈ బంధం? ఆయనెవరు?

పాప ఎవరు?

ఒకవారంలోనే ఆమెకు ఉద్యోగంలో మార్పువచ్చింది. ఉద్యోగం పెద్దదయింది. జీతం పెరిగింది.

ఆనెలలోనే హాస్పిటల్ కి బ్రెయిన్ స్పెషలిస్టు వస్తున్నాడన్నవార్త హాస్పిటలంతా మారుమ్రోగింది. ఆయనకు వెల్ కమ్ పార్టీ ఏర్పాటయింది. ఆహ్వాన సంఘంలో నియమితురాలయిందివల్లి. డ్రింకులూ పూలహారాలూ అన్నీ స్వయంగా వల్లి చూడవలసివచ్చింది. పార్టీలో ప్రముఖురాలిగా పని చేయవలసిన బాధ్యత వహించవలసివచ్చింది.

ఆహూతులందరూ హాల్లోకివస్తుంటే రిటైరయిన సూపర్నెంటుగారిని తీసుకు వచ్చి ముందుసీట్లో కూర్చోబెట్టింది మదర్. తను వెళ్ళి నమస్కారంపెట్టింది. ఆమెనుచూడగానే ఆయన ముఖం ప్రఫుల్లమయింది.

పదినిమిషాలలో హాలంతానిండిపోయింది. ముఖ్యఅతిధికూడా వచ్చాడు. గొప్ప డాక్టరట జర్మనీనుంచి వచ్చాడట.

ఆ పార్టీలో-రెండుజడలు వేసుకుని లేతగులాబీరంగు ఫ్రాక్ వేసుకుని రోజీ అందరికీ డ్రింకు లందిస్తోంది. హాలంతా తానే అయితిరుగుతోంది.

కొత్తగావచ్చిన డాక్టరు రిటైరయిన సూపర్నెంటు ప్రక్కనకూర్చుని మాట్లాడుతున్నాడు. రోజీని చూపించాలనీ మాట్లాడించాలనీ పాత సూపర్నెంటు తపించిపోతున్నాడు.

రోజీ డ్రింక్ తీసుకురాగానే రిటైరయిన సూపర్నెంటు "ఈ డాక్టరుగారికి కూడా తీసుకురా" అని ఆమెను పంపించాడు. ఆమె చేత ఆయనకు డ్రింకు ఇప్పించాడు.

"రోజీ మేము డ్రింకు తాగేవరకూ ఇక్కడేఉండు" అన్నాడు.

"నేనింకా చాలా మందికి ఇవ్వాలండి" అన్నది.

"చాలామందికి ఇవ్వటానికి చాలామందిఉన్నారు. నీ విక్కడేఉండు" అన్నాడు మళ్ళీ.

వేదికమీదికి ప్రముఖులందరూ చేరుకున్నారు. హాస్పిటల్లో పనిచేసే స్పెష లిస్టు లందరూ వేదికమీదే ఉన్నారు.

కొత్త సూపర్నెంటు అధ్యక్షస్థానంలో కూర్చున్నాడు ఆయన కొత్తగా వచ్చిన డాక్టరుని హాస్పిటల్ డాక్టర్లకూ ఆహూతులందరికీ పరిచయంచేశాడు. హాస్పిటల్లో స్పెషలిస్టులనందరినీ పిలిచి పరిచయంచేశాడు.

కొత్తగావచ్చిన డాక్టర్ని గురించి కొత్తసూపర్నెంటు మన ఊరి మెడికల్ కాలేజిలో చదివి, విదేశాలలో రీసర్చిచేసి, జర్మనీనుండి బ్రైన్ స్పెషలిస్టుగా మళ్ళీ మన ఊరికేవచ్చిన డాక్టర్ శివంను గురించీ, ఆయనచేసిన రీసర్చినిగురించీ ఎంత చెప్పినా చాలదు. మనకు బ్రైన్ స్పెషలిస్టులు చాలాతక్కువసంఖ్యలో ఉన్నారు. డాక్టర్ శివంగారు స్పెషలిస్టులందరికంటె ఎన్నో డిగ్రీలు డిప్లొమాలు కలవారు. వారు మన హస్పిటల్లో పనిచేయటానికి అంగీకరిస్తే ఈ హాస్పిటల్ మదరాసు బొంబాయి కలకత్తాలకంటె ప్రజలకు గొప్ప సేవ చేయకలుగుతుంది. వారందుకు అంగీకరిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు.

అందరితోపాటు రోజీకూడా చప్పట్లుకొట్టింది. డాక్టరు శివం పేరు వినబడ గానే కూర్చున్న చోటినుంచి లేచినిలబడి చూసింది వల్లి. 'చాలా మారిపోయాడు మనిషి. ఇంతకూ ఈయన ఆయనవునోకాదో ? ఇక్కడే చదివాడని అంటున్నారు. ఇక్కడివాడేనంటున్నారు. నాకెవరుచెప్తారు అసలుసంగతి ?' ఆమెకంతలో విరక్తి.

అంతలో స్టేజిమీద ఎవరికో మంచినీళ్ళు కావాలన్నారని తీసుకువెళ్ళుతుంటే రోజీ తాను తీసుకుపోతానని బయలుదేరింది. స్టేజిమీదికివెళ్ళి అడిగిన వాళ్ళకిచ్చి

గ్లాసుకొరకు నిలబడ్డది. రోజీలో అతడి పోలికలు స్పష్టంగా కనబడుతున్నాయి వల్లికి.

అందరూ వెళ్ళటానికి లేచారు. పాతసూపర్నెంటుగారి కారులో కొత్తగా వచ్చిన డాక్టరుగారుకూడా వెళ్ళారు.

"నాన్నా, రోజీ అనిపిలుస్తున్నారందరూ-ఆ అమ్మాయి నాకు డ్రింకు తెచ్చి యిచ్చిందికూడాను. ఆ అమ్మాయి........"

'ఆ అమ్మాయినీ ఆమెతల్లినీ రేపు ఉదయం కారుపంపించి పిలిపిస్తాను చూడు. ఆ రోజీ చలాకీతనం ఆ పనీ నేర్పూచూస్తే నా పిల్లలు చిన్నప్పుడు అలాగే ఉండేవారని జ్ఞాపకానికి వస్తుంది. నీవు ఇక్కడున్నప్పుడు ఒకవిషయం చెప్పావు. తరువాత విదేశాలనుంచి ఉత్తరాలురాశావు. కాని నేనుచేసినదేమిటంటే ఆ అమ్మాయి అదే వల్లి అంటున్నారిక్కడందరూ- ఆ సౌందర్యవల్లిని చూడగానే పిలిచి మాట్లాడించాను. ఆమెమాటలు పూర్తిగా నాకు అర్థంకాలేదు. మదర్‌చేత అడిగించాను. అప్పుడంతా తెలిసిపోయింది. అయినా నలుగురూ సందేహించకుండా స్టోర్‌కీపరు చేతికింద ఉంచి జీతమేర్పాటుచేశాను. రోజీ పుట్టినదగ్గర్నుంచీ నేనే అన్ని ఏర్పాట్లు చేస్తున్నాను. వల్లి అంటే వజ్రపుతునక అనుకో. తలవంచుకుని పనిచేసింది బాధ్యతతో. రోజీ హాస్పిటల్ బాధ్యతఅంతా తనదేననుకుని రొండుస్సేస్తుంది. నీవు చూడాలనే డ్రింక్ తెప్పించాను రోజీచేత. చూశావా ఆ మాటతీరు-పనితీరూను?' నవ్వుతుంటే ఎవరిలా ఉంటుందనుకున్నావు? అంతా అమ్మలాగేననిపిస్తుంది. అంతేకాదు నీలాగకూడాను."

నవ్వుకున్నాడు శివం.

తెల్లవారగానే తల్లీకూతుళ్ళను కారులో పిలిపించటానికి తగిన ఏర్పాటు చేశాడు.

రిటైరయిన సూపర్నెంటు డాక్టరు కేశవరావు.

రోజీ పదిగొన్లు కిందపడేసింది ఒక్కటి ఏరుకోవటానికి. తన డ్రెస్సింగయిన తరువాత తల్లిదగ్గరకొచ్చింది.

"ఏమిటమ్మా నీవిలాగే ఉన్నావు?"

"నేను నీతో రావటంలేదు. ఆ కొత్తడాక్టరుగారిని గెస్టుహౌస్‌కు రమ్మను. అక్కడ కలుస్తాను."

"అట్లాఅంటే బాగుంటుందా? మనకు వాళ్ళుచేస్తున్న మర్యాదకు మనం విలువ ఇవ్వద్దా ?"

"ఇద్దాం నీవలాచెప్పు అంతే."

అంతలో కారురాగానే రోజీ వెళ్ళిపోయింది. ఆ వెంటనే మరోకారు వచ్చింది గెస్టుహౌస్‌నుంచి ఎవరో చెప్పినట్టుంది.

వల్లి సామాన్యమైన వేషధారణతో వెళ్ళింది. అతడు ఎంత సేపటికీ దిగిరాదేమా అని వచ్చి, కారు తలుపుతీసి ఆమెదిగేవరకూ నిలబడ్డాడు.

'లోపలికిరా' అంటూ తీసుకువెళ్ళి సోఫాలో కూర్చొబెట్టుకున్నాడు.

చాలాకాలానికి కలుసుకున్న ఇద్దరికీ ఏమి మాట్లాడాలో తెలియలేదు. ఎవరు ముందు పలకరించాలి? ఎవరిని ఎవరు ఓదార్చాలి ?

"మీరిక్కడే చదువుకున్నారా ?" అడిగింది చివరకు.

"అవును ఇక్కడే సీటువచ్చింది. చదివాను"

"మరి అప్పుడు నేను ఇక్కడ ఉన్నట్టు తెలుసా ?"

"ఎందుకు తెలియదు ? సుందరం ఎక్కడుంటే శివం అక్కడుంటుందని నీకు తెలియదా ?"

"ఆఁహాఁ. మరి చూడటానికి రాలేదు? మీకు పాపపుట్టినప్పుడైనా చూడాలని పించలేదా ?"

"చూడలేదని ఎందుకనుకుంటావు ? నాబిడ్డనుచూశాను. అన్ని ఏర్పాట్లు చేశాను."

"మరి విదేశాలకు వెళ్ళేటప్పుడు నాకుచెప్పివెళ్ళితే సంతోషించేదాన్నికదా ?"

"విదేశాలకు నీఫోటో తీసుకెళ్ళాను. దగ్గరుంచుకున్నాను. మాట్లాడేను. నేను ఎక్కడికివెళ్తే అక్కడికి తీసుకువెళ్ళాను. సుందరంలేనిదీ శివం ఉండదని ఇందాక చెప్పానుగా ?"

"అయితే మనపెళ్ళి వాలిడ్ అన్నమాటేనా ?"

"నాకాకొత్తమాటలు కొత్తభాషలు తెలియవచ్చా ! అప్పుడు మనం రిజిష్టర్డు మేరేజి చేసుకున్నాము. అది ఎప్పటికీ వాలిడే నీవు ఒద్దనేవరకూ." ఆమె ముఖం లోకి చూశాడు.

"నేనా ? నేనామాట అంటానా? అంటే మీరనాలి? నన్ను-నేనెవరో తెలియక పోయినా అంతగా ఆదరించిన ఆ మహాపురుషుడికి చెయ్యెత్తి నమస్కరించాలి. నేనెంతో ఋణపడిఉన్నాను ఆయనకు. అక్కడికివెళ్ళి నాకృతజ్ఞతలు చెప్పకోవాలి ముందర."

"నాకోడల్ని స్టోరుకీపరు చేతిక్రిందఉంచాను ఆ ఒక్క చిన్నగదిలో"నని ఆయన బాధపడుతున్నారు. పదవెళ్దాం ఆయన దగ్గరికి. ఈపాటికి తాత అని తెలిసిన తరువాత రోజీ ఆయననెత్తిమీదకెక్కి కూర్చునేఉంటుంది. అదే నీకూ ఆయనకూ సమాధానం చెబుతుంది." అంటూ కారులో బయలుదేరారు.

"పాపద్వారా మనసంబంధాలను చెప్పించుకోవాలా ? అన్నది కినుకతో.

"అవును అదే బాగుంటుంది. మీకేమవుతుందామె" అని పాప అడిగిన దాని కంటె ఇదేనయం. పైగా సంతోషించి మనమధ్యలోఉన్న అపోహలను పోగొట్టు తుంది. చూడు నిజమవునోకాదో ? ఆరోజు నీవు నన్నునమ్మి నావెంటవచ్చావు. ఈనాడు నేను నిన్నునమ్మి నీవెంటవస్తున్నాను." ఈ కథ ఇంతే. ఇది వాలిడ్.